క్లుప్తంగా

ఘనంగా జాతర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ జంక్షన్‌లో కొలువైన కన్నమాంబ పేరంటాలు తల్లి జాతర మహోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ భరత్ రామ్ విచ్చేశారు. ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎంపీ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, నగర యువజన పార్టీ అధ్యక్షుడు పీతా రామకృష్ణ, అన్నపూర్ణ రాజు, రాజమౌళి, నెల్లి సర్వేశ్వరరావు, చంద్రారెడ్డి, వాసు, రాంబాబు, సతీష్ పాల్గొన్నారు.

మార్కెట్లోకి హీరో ఫ్యాషన్ ప్లస్


మోటార్ సైకిల్‌ను ఆవిష్కరిస్తున్న రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన హీరో ఐకానిక్ ఫ్యాషన్ ప్లస్ మార్కెట్లోకి విడుదలైంది. మెయిన్ రోడ్డులోని సీపీ రెడ్డి షోరూంలో నగర పాలక సంస్థ మాజీ కమిషనర్ జితేంద్రతో కలిసి రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి బుధవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ రెడ్డి హీరో మోటోకార్ప్ చైర్మన్ సి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ 97 సీసీ డ్రం బ్రేక్స్, సైడ్ స్టాండ్ కట్ ఆఫ్‌తో పాటు సెల్ చార్జర్ తదితర అదనపు ఫీచర్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హీరో మోటోకార్ప్ డైరెక్టర్లు సంజీవరెడ్డి, ప్రభాకర్ సీనియర్ పాత్రికేయుడు కృష్ణకుమార్, సైకాలజిస్ట్ దారపు నాగిరెడ్డి, ఆర్‌వీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాకు కాంట్రాక్టు అధ్యాపకుల వినతి


ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ప్రకాశం నగర్: కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, రెగ్యులరైజేషన్ విషయంలో 2014 జూన్ –2కు ఐదేళ్లు ఉండాలనే నిబంధనను ప్రభుత్వం తొలగించాలని కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్ర కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను బుధవారం ప్రకాశం నగర్‌లోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. రాజా మాట్లాడుతూ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమిటీ నాయకులు ప్రసాద్ నాయుడు, సూర్యనారాయణ, గోవింద్, వరప్రసాద్ పాల్గొన్నారు.

సిల్ట్ తొలగింపు పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కాలువల్లో సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలో జరుగుతున్న డిసిల్టేషన్ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులతో కలిసి బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆవ చానల్ పైభాగంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలన్నారు. కూడళ్ల వద్ద యంత్రాలతో పాటు మనుషులను కూడా ఉపయోగించి పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపంతో గోదావరిలో దూకిన తాళ్లపూడికి చెందిన కె.రవిశంకర్ శ్రీనివాస్ మృతదేహం బుధవారం లభ్యమైంది. రెండో పట్టణ పోలీసులు ఆ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

పేకాట శిబిరంపై దాడి

ధవళేశ్వరం: గ్రామంలోని శేషగిరిరావుపేటలో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మంది అరెస్టు చేసి, రూ 34,230 స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన

ప్రకాశం నగర్: విద్యుత్ సద్దుబాటు చార్జీల వసూలును నిలిపివేయాలని, కరెంట్ బిల్లుల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జాంపేట విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను నెలవారీగా పెంచే విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జువ్వల రాంబాబు, ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. మరింత సౌకర్యం

- రూ. 1.50 కోట్లతో రోడ్డు నిర్మాణం
- వాహనచోదకుల హర్షం


వీరభద్రపురం -తూర్పురైల్వేస్టేషన్ రోడ్డు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగర పాలకసంస్థ పరిధి 16వ డివిజన్‌లో తాడితోట వీరభద్రపురం నుంచి తూర్పు రైల్వేస్టేషన్ వరకూ వెళ్లే రోడ్డులో ప్రయాణం రయ్‌రయ్‌మంటూ సాగనుంది. గతంలో ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవించాల్సి వచ్చేది. గతుకులు, గోతులమయంగా ఉన్న దీని రూపురేఖలను రాజమహేంద్రవరం నగరపాలకససంస్థ అధికారులు మార్చేశారు. రూ.1.50 కోట్లతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు.

గతంలో భయం భయం

తాడితోట వీరభద్రపురం నుంచి తూర్పు రైల్వేస్టేషన్ మీదుగా బాలాజీపేట వైపు రోజూ వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు గతుకులు, గోతులమయంగా ఉండేది. దీనివల్ల రాత్రి సమయంలో ప్రయాణించాలంటేనే వాహనచోదకులు భయాందోళనకు గురయ్యేవారు. ఈ సమస్యను తెలుసుకున్న రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ విషయాన్ని నగరపాలకసంస్థ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. దీంతో ఆయన ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు వేయించి రూ.1.50 కోట్లతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించడంతో పాటు నిధులను మంజూరు చేశారు. ఇరుకుగా ఉండే 40 మీటర్ల రోడ్డును 75 మీటర్లకు పెంచి బీటీరోడ్డును నిర్మాణం చేశారు. అక్కడక్కడా స్పీడు బ్రేకర్లను సైతం చేశారు.

చాలా బాగుంది

రోడ్డు సమస్యకు మోక్షం లభించింది. గతంలో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే చాలా భయంగా ఉండేది. కొత్తగా రోడ్డు నిర్మాణం చేసిన తరువాత ప్రయాణం హాయిగా సాగుతోంది.

– ధర్మారెడ్డి, సామాజిక కార్యకర్త, హుకుంపేట

రూ.1.50 కోట్లతో నిర్మాణం

వీరభద్రపురం నుంచి తూర్పు రైల్వేస్టేషన్ వరకు రెండు కిలోమీటర్ల మేర రూ.1.50 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టాం. అల్యూమినియం కంపెనీల మధ్య రోడ్డుతో పాటు అయ్యప్పనగర్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. మంజూరు కాగానే నిర్మాణం ప్రారంభమవుతుంది.

– శ్రీధర్, ఏఈ, నగరపాలకసంస్థ

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి


రక్తదాన శిబిరంలో పాల్గొన్న జక్కంపూడి రాజశ్రీ



రక్తదాతలకు సర్టిఫికెట్ల ప్రదానం

కంబాలచెరువు: ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని డాక్టర్ వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ సెంటర్ నిర్వాహకురాలు జక్కంపూడి రాజశ్రీ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా దానవాయిపేట వైఎస్సార్, జక్కంపూడి బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ఒక మనిషిని బతికించడమేనని, రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానంపై అపోహలను తొలగించి, రక్తదాతలకు అవగాహన కల్పించి, చైతన్య పరచడమే రక్తదాతల దినోత్సవ పరమార్థమన్నారు. కార్యక్రమంలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ట్రస్టీ పట్నాయక్, విక్రమ్ జైన్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు.

పేపర్ మిల్లులో..

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జైన్ సేవా సమితి, మాగ్నా మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో పేపర్ మిల్లులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేష్ జైన్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన మిల్లు ఉద్యోగులు, కార్మికులను అభినందించారు. జైన్ సేవా సమితి అధ్యక్షులు విక్రమ్ జైన్ మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న బాలలకు రక్తం చాలా అవసరమన్నారు. రక్తదాతలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఏ.జయకృష్ణ, వెల్ఫేర్ మేనేజర్ ఇ.వెంకటేశ్వరరావు, పేపర్‌మిల్లు వైద్యులు డాక్టర్ దిలీప్ కుమార్, మాగ్న హాస్పిటల్ మదన్ రాజ్ పురోహిత్, జగదీష్, అనిల్, జైన్ సేవా సమితి దిలీప్ జైన్, అశ్విన్ జైన్, బిజేష్ వైష్ణవ్ పాల్గొన్నారు.

ఆదిత్యలో..

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల కళాశాలలో ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దీనిని ప్రిన్సిపల్ ఎస్‌కేఎస్ రెహమాన్ ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎన్.నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్ వీ.రమాదేవి, కె.మహేశ్వరి, ఎం.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కార్పొరేట్ కళాశాలల యజమానులు ప్రోత్సహించేందుకు ముందుకు రావాలని ఎంపీ మార్గాని భరత్ రామ్, నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. నగరంలో 13 ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలతో బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో నగరపాలక సంస్థలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహమిచ్చేందుకు కళాశాలల యాజమాన్యాలు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. కార్పొరేట్ కళాశాలల యజమాన్యాలు స్పందిస్తూ గత సంవత్సరం మాదిరి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి రూ.13 వేలు, రెండో సంవత్సరానికి రూ.18 వేలు కళాశాలకు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల పుస్తకాలు, యూనిఫాం, రవాణాకు ఖర్చులు అదనంగా చెల్లించాలన్నారు. కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు అంగీకారంతో 83 మంది విద్యార్థులకు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు కళాశాలలో చేరిన తర్వాత ఐఐటీ, పాలిటెక్నిక్‌లలో ప్రవేశం లభిస్తే, వారి సర్టిఫికెట్లు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తిరిగి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి, డీఈఓ ఎస్.అబ్రహం పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో అడ్మిషన్లు

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు ఆన్‌లైన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి బుధవారం తెలిపారు. 2023 –24 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ చేస్తామని, 19 నుంచి 24 వరకూ విద్యార్థినులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే 21 నుంచి 23 వరకు స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని, జూలై 3న సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు. విద్యార్థినులు జూలై 4 నుంచి కాలేజీలో రిపోర్ట్ చేయాలని తెలియజేశారు.

వాడపేటలో చోరీ

ధవళేశ్వరం: స్థానిక వాడపేటలోని మైలపల్లి రామకృష్ణ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే. మంగళవారం రాత్రి రామకృష్ణ కుటుంబం పోలేరమ్మ జాతరకు వెళ్లారు. ఉదయం వచ్చి చూసేసరికి బీరువాలో ఉండాల్సిన నాలుగు కాసుల విలువైన నాలుగు జతల చెవి దిద్దులు, రెండు జతల చెంప సవరాలు, బంగారు గొలుసు, రెండు ఉంగరాలు, రూ. 30 వేలు, ఆండ్రాయిడ్ ఫోన్ మాయమయ్యాయి. వీటి విలువ రూ.1.15 లక్షలు ఉంటుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి


ఫౌంటైన్ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


- రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి
- అనపర్తిలో వాటర్ ఫౌంటైన్ ప్రారంభం

అనపర్తి: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్టు రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తెలిపారు. వేమగిరి–సామర్లకోట కెనాల్ రోడ్డులో స్థానిక దేవీచౌక్ సెంటర్ వైఎస్సార్ విగ్రహం వద్ద రుడా నిధులు రూ.15.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి షర్మిలారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుడా పరిధిలోని వివిధ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో పచ్చదనం–పరిశుభ్రతలో భాగంగా మొక్కలు నాటించడం, లైటింగ్ ఏర్పాటు, వివిధ సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ముందుగా దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, రుడా వైస్ చైర్ పర్సన్ బి.బాలస్వామి, కార్యదర్శి శైలజవల్లి, ఈఈ టి.చంద్రశేఖరరావు, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నల్లమల్లి కార్తిక్ ఎలియాస్ షూటర్ కార్తిక్, తెలగరెడ్డి నాగమణికంఠ ఎలియాస్ మణి, బత్తిన నగర్ ప్రాంతానికి చెందిన ఆముదాల వినయ్.. ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ బోర్డు కాలనీ శివారు ప్రాంతమైన అటవీశాఖ ప్రహరి వద్ద గంజాయితో తచ్చాడుతున్న ఈ ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్ కోసం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

న్యాయవాది ఖాదర్ మృతి



ధవళేశ్వరం: ఇండస్ట్రియల్ కాలనీకి చెందిన ప్రముఖ న్యాయవాది సయ్యద్ ఖాదర్(58) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ కార్యదర్శి, ఉపాధ్యక్షులుగా సేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సినిమాలు

శ్యామల : అహింస
సూర్యమినీ : ది ఫ్లాష్
సూర్యప్యాలెస్ : ట్రాన్స్‌ఫార్మర్స్
స్వామి : బిచ్చగాడు–2
శివజ్యోతి : ఇంటింటి రామాయణం
అనుశ్రీ : ట్రాన్స్‌ఫార్మర్స్
రాజా : ట్రాన్స్‌ఫార్మర్స్
అశోక : టక్కర్
ఊర్వశి : అన్‌స్టాబుల్
రంభ : విమానం
మేనక : యూనివర్సిటీ
అప్సర : ది ఫ్లాష్

నామవరం

వీఎస్ మహల్ : ట్రాన్స్‌ఫార్మర్

ధవళేశ్వరం

మురళీకృష్ణ : టక్కర్

కడియం

వెంకటసూర్య : టక్కర్

రూ.300 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి

- ఎంపీ భరత్ రామ్
- రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన ఢిల్లీ బృందం


ఢిల్లీ బృందంతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టబోతోందని, రానున్న రెండేళ్లలో సుమారు రూ.300 కోట్లతో ఆధునిక హంగులతో, అత్యాధునిక జీ ప్లస్ త్రీ భవనంతో అన్ని సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. అభివృద్ధి నిధుల మంజూరు కోసం రైల్వేస్టేషన్‌ను బుధవారం ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం పరిశీలించింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ గతంలో రైల్వే అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలను రైల్వేబోర్డుకు పంపామన్నారు. ఈ నేపథ్యంలో రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ పథకంలో భాగంగా సుమారు రూ.300 కోట్లతో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. 500 అడుగుల వెడల్పుతో పెద్ద భవనం, మొదటి అంతస్తులో ప్యాసింజర్ల కోసం, రెండోఅంతస్తులో కమర్షియల్ షాపులు, అన్ని రెస్టారెంట్లు, మూడో అంతస్తులో బోటిక్, హోటల్ వచ్చేలా డిజైన్ చేస్తున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చర్యలు చేపట్టారన్నారు. లిఫ్ట్, ఎస్కలేటర్లు ఏర్పాటు కానున్నాయని, ప్రస్తుతం స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫాం ఉండగా, మరో రెండు నిర్మాణమవుతున్నాయన్నారు. తూర్పు రైల్వేస్టేషన్ వైపు మరో ప్లాట్‌ఫాం రానుందన్నారు. నగరంలోని అన్నపూర్ణమ్మపేట ఎల్సీగేట్ వద్ద ఆర్వోబీకి రూ.76 కోట్లు మంజూరయ్యాయని, కేశవరం, అనపర్తి రైల్వే ఎల్సీల వద్ద ఆర్‌ఓబీలు నిర్మించాల్సిన అవసరం ఉందని, వాటికి రైల్వే బోర్డు అనుమతి కూడా వచ్చిందన్నారు. గతిశక్తి డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ ఐ.రవీంద్ర, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్, ఈడీఎంఏసీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ఆర్కిటెక్ట్ ఫైజా అహ్మద్, అర్బన్ తహసీల్దారు వాకపల్లి సుస్వాగతం, ఆర్‌ఎంసీ సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, ఈఈ శేషగిరిరావు, ఆర్‌ఎంసీ సర్వేయర్ అనిత, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళీ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పథకాలపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా వ్యవసాయశాఖ సహకారంతో తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) సమావేశ మందిరంలో బుధవారం రైతుసంక్షేమ పథకాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల కోసం అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, అవి పొందేందుకు కావాల్సిన అర్హతలను వివరించారు. అర్హత ఉండి, పథకాలు అందకపోతే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఉచిత న్యాయ సలహాలు, న్యాయసేవలు కూడా పొందవచ్చన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి, డీఆర్‌పీ ఏడీఏ రామలక్ష్మి, తొర్రేడు సొసైటీ సభ్యుడు దండమూడి అర్జునరావు, రైతులు, సొసైటీ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బాలకార్మిక నిర్మూలన కోసం జరుగుతున్న నెలరోజుల శిబిరంలో భాగంగా సంబంధిత అధికారులతో న్యాయమూర్తి సమావేశమయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పలు సూచనలు చేశారు.

పీఎంపీలకు బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై శిక్షణ


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శశాంక్

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో ప్రాథమికంగా వైద్యసేవలందించే పీఎంపీలు బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ పి.శశాంక్, డాక్టర్ విద్యాదీపక్ అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ది పీఎంపీ అసోసియేషన్) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో బుధవారం హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్‌లో వైద్యవిజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మండల కన్వీనర్ అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్లు శశాంక్, విద్యాదీపక్ మాట్లాడుతూ పీఎంపీలకు బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని, అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ ప్రక్రియ ద్వారా ప్రాణాలు ఎలా కాపాడాలో తెలుస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నూతన వైద్యవిధానాలను తెలుసుకుని ప్రజలకు మేలైన సేవలందించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం విశిష్టతను తెలిపారు. రాష్ట్ర కోశాధికారి ఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ సభ్యులు ఐక్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమన్నారు. జిల్లా కన్వీనర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, జిల్లా కోకన్వీనర్లు బళ్లా శ్రీనివాసరావు, కేఎస్ ప్రసాద్, మండల కోకన్వీనర్లు మట్టా రమేష్, యు.ప్రసాద్ బాబు, పి.దేవానందం, ఏ.సురేష్ బాబు హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో రాజమండ్రి శాఖ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ రహమాన్ ఖాన్, కార్యదర్శిగా మట్టా రమేష్, కోశాధికారిగా యు.ప్రసాద్‌బాబును మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జగనన్న పాలన విద్యార్థులకు వరం


జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన విద్యార్థులకు వరమని ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ నీలి ఆనంద్ బాబు కొనియాడారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం కంబాల చెరువు సెంటర్‌లో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని పథకాలు మన రాష్ట్రంలో అమలు జరుగుతున్నాయన్నారు. విద్యారంగానికి అధిక మొత్తంలో ఖర్చు చేసి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.